


# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 288

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 27 మార్చి 2024

## వైసీపీ దిగిపోతేనే ప్రజలు సుఖంగా ఉంటారు : టీడీపీ అధినేత చంద్రబాబు

● పార్టీలో చేరిన వైసీపీ నేతలు, కార్యకర్తలకు చంద్రబాబు ఆహ్వానం






**కుప్పం,కలంకౌంటర్ :** చంద్రబాబు నాయుడు సమక్షంలో నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు మంగళవారం టీడీపీలో చేరారు. శాంతిపురం, రామకుప్పం, కుప్పం మండలాల నుండి పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. కేవీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం వీరంతా చేరగా కండువా కప్పి చంద్రబాబు ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు 'మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రజలు గెలిస్తే రాష్ట్రం నిలుస్తుంది. వైసీపీకి ఓటు వేస్తే ఏమవుతుందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. వైసీపీ దిగిపోతేనే ప్రజల సుఖంగా ఉంటారు. వైసీపీ ఓడిపోవడం ఖాయం. మీ అభివృద్ధి సంక్షేమాన్ని రాజకీయాలే నిర్ణయిస్తాయి. దానికి తగ్గ నాయకులను ఎన్నుకుంటేనే భవిష్యత్తు ఉంటుంది. ఒక్క ఛాన్స్ తో జగన్ ప్రజలకు మరణ శాసనం రాశారని అన్నారు. చేరిన వారిలో పీఈఎస్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ ఆశాలత, రిటైర్డ్ సీఐ రాజేంద్ర, శాంతిపురం నాయకులు ప్రకాష్ స్వామి, జరుగు ఎంపీటీసీ అభ్యర్థి జనార్ధన్, హేమాద్రి, కొత్తపేట వాసు, కొత్తపేట్ నాగరాజు, డా.సోహైల్, సవిత, మానవ హక్కుల సంఘం నాయకులు జలపతి, భాస్కర్, దుబాయ్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ ప్రచారం





**కుప్పం,కలంకౌంటర్ :** కుప్పంలోని బాబు నగర్ లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ ప్రచారంలో భాగంగా మంగళవారం చంద్రబాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అమలు చేయబోయే సూపర్-6 పథకాలను గురించి మహిళలకు వివరించారు. ఈ ప్రభుత్వంలో తాము పడుతున్న ఇబ్బందుల గురించి చంద్రబాబు వద్ద మహిళలు ఏకరవుపెట్టారు. ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. టీడీపీకి అనుకూలమన్న ఉద్దేశ్యంతో తమ పెన్షన్లు తొలగించారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం వస్తే అన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుందని, రెండు నెలలు ఓపిక పట్టాలని సూచించారు. అకారణంగా లబ్ధిదారులకు ఈ ప్రభుత్వం నిలపేసిన సంక్షేమ పథకాలను తిరిగి అందిస్తామని భరోసా ఇచ్చారు.

## వైసీపీలో చేరికలు



**తాడేపల్లి,కలంకౌంటర్ :** సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన విజయవాడకు చెందిన పలువురు టీడీపీ మాజీ కార్పొరేటర్లు, జనసేన నాయకులు. గండూరి మహేష్, నందెపు జగదీష్ (మాజీ కార్పొరేటర్లు), కొక్కిలిగడ్డ దేవమణి (మాజీ కోఆప్షన్ మెంబర్), కోసూరు సుబ్రహ్మణ్యం (మణి) టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ, గోరంట్ల శ్రీనివాసరావు, మాజీ డివిజన్ అధ్యక్షులు, బత్తిన రాము (జనసేన విజయవాడ తూర్పు నియోజకవర్గం ఇంఛార్జి) ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ వైఎస్ఆర్‌సీపీ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, విజయ వాడ ఈస్ట్ వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్.

## అనుమతులు పొందేందుకు 'సువిధ' పోర్టల్ ను వినియోగించుకోవాలి

● రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా






**వెలగపూడి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు, వారి ప్రతినిధులు నిర్వహించే సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ తదితర ప్రచార కార్యక్రమాలకు ముందస్తు అనుమతి పొందేందుకై 'సువిధ' పోర్టల్ ను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కోరారు. ఇందుకోసం 48 గంటలకు ముందుగానే సువిధ యాప్ ద్వారా లేదా నేరుగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి ధరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆన్లైన్ నామినేషన్లు, అఫిడవిట్ లను దాఖలు చేసేందుకు , ముందస్తు అనుమతులు మంజూరుకై ఆన్లైన్ దరఖాస్తు చేసుకునేందుకు సుధా పోర్టల్ ను ఈసీఐ డిజైన్ చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో నున్న నేపథ్యంలో రాజకియ పార్టీలు, వారి ప్రతినిధులు అనుసరించాల్సిన విధి విధానాలు, ముందస్తుగా తీసుకోవాల్సిన అనుమతులను వివరించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర సచివాలయంలో ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. అదనపు సీఈవో ఎమ్.ఎన్. హరెంధిర ప్రసాద్ తో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ, బి.జె.పి., సిపిఐ (మార్క్సిస్టు), ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, నేషనల్ పీపుల్స్ పార్టీ, టిడిపి, వైఎస్సార్సీపి తదితర పార్టీలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పార్టీ నిర్వహణ అవసరాలకు పవన్ కళ్యాణ్ రూ.10 కోట్ల విరాళం

**గుంటూరు,కలంకౌంటర్ :** జనసేన పార్టీ ఉన్నతి కోసం మొదటి నుంచి తన స్వార్జితాన్ని పార్టీ కోసం వెచ్చిస్తూ వస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరోసారి భారీ విరాళాన్ని అందించారు. తన పారితోషికం నుంచి ఎప్పటికప్పుడు పార్టీకే కాకుండా సామాజిక సేవలకు, అధ్యాత్మిక కార్యక్రమాలకు, ఆపదలో ఉన్నవారిని ఆదుకొనేందుకు విరాళం ఇస్తుంటారు. ఈ క్రమంలోనే జనసేన పార్టీ నిర్వహణ అవసరాల నిమిత్తం రూ.10 కోట్ల స్వార్జితాన్ని విరాళంగా అందించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సమక్షంలో పార్టీ కోశాధికారి ఎ.వి.రత్నం కి విరాళం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ స్వతంత్ర సంగ్రామాన్ని ముందుకు నడపించడానికి మోతీలాల్ నెహ్రూ వంటి గొప్ప నాయకులు తమ స్వార్జితాన్ని ఉద్యమానికి విరాళంగా ఇచ్చేవారు. ఆ రోజుల్లో తమ సొంత డబ్బును వెచ్చించిన తీరు గొప్పది. ఓ సదాశయం కోసం, రాష్ట్ర భవిష్యత్తును సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జనసేన సాగిస్తున్న రాజకీయ ప్రయాణానికి నా వంతుగా ఇప్పుడు ఎన్నికల ప్రచార ఖర్చుల నిమిత్తం రూ.10 కోట్లను అందజేస్తున్నాను. ఇది పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. జనసేన పార్టీ ప్రయాణానికి సగటు కూలి తన చిన్నపాటి సంపాదనలో రూ.వంద పక్కన పెట్టి పార్టీ ఎదుగుదలకు ఎంతగానో తోడ్పాడుతున్నారు. ఓ బెల్దారీ మేస్త్రి రూ.లక్ష విరాళం అందించారు. అలాగే పింఛను నుంచి వచ్చే సొమ్ములో కొంత భాగం పార్టీకి తమ వంతుగా పంపుతున్న సగటు మనుషులెందరో



ఉన్నారు. వారంతా ఎన్నో ఆశలతో, ఆశయాలతో నిర్మించిన పార్టీ కోసం తమ వంతు సాయం అందిస్తున్నారు. అలాంటి వారి స్ఫూర్తితో నేను సినిమాల ద్వారా వచ్చిన నా కష్టార్జితాన్ని, ప్రభుత్వానికి పన్నులు కట్టిన తర్వాత నా దగ్గర ఉన్న డబ్బును పార్టీ కోసం అందించడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల వేళ ఈ డబ్బు పార్టీకి ఎంతగానో ఉపయోగపడుతుందని భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు బి.మహేందర్ రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్ కుమార్, పార్టీ నేతలు మర్రెడ్డి శ్రీనివాస్, పంచకర్ల సందీప్, తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రాష్ట్ర హెూంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తానేటి వనిత కామెంట్స్



**యర్నగూడెం,కలంకౌంటర్ :** దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ లో వాలంటీర్ వ్యవస్థను క్రియేట్ చేసింది ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి : హెూంమంత్రి తానేటి వనిత ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమం కూడా గడప గడపకూ అందిస్తూ సేవ చేస్తున్నారు. ౖ ప్రజలందరూ వాలంటీర్లకు నీరాజనాలు పలుకుతుంటే... టీడీపీ, జనసేన నాయకులు అది చూసి ఓర్వలేకపోతున్నారు. వాలంటీర్లపై లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నారు. మహిళలను అక్రమ రవాణా చేస్తున్నారని.. ఆడవాళ్లని అమ్మేస్తున్నారని కేంద్ర నిఘా వర్గాలు చెప్పాయని పవన్ కళ్యాణ్ అనడం హాస్యాస్పదం.. వాలంటీర్లు చిత్తశుద్ధితో ప్రజలకు సేవలు అందిస్తున్నారు.. కోవిడ్ సమయంలో టీడీపీ వాళ్లందరూ ఇంట్లో దాక్కుంటే.. సేవలందించింది వాలంటీర్లు కాదా..? తెలుగుదేశం నాయకులు వాలంటీర్లను టెర్రరిస్టుల్లా పనిచేస్తున్నారని కామెంట్ చేయడం బాధాకరం.. వాలంటీర్లు చేసే సేవ టీడీపీ నాయకులకు టెర్రరిజంలా కనిపిస్తుందా..? రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాలంటీర్లకు అందరికీ తెలుగుదేశం పార్టీ క్షమాపణలు చెప్పాలి, తమ వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలని హెూంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థి తానేటి వనిత డిమాండ్.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం

● జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి ● 426 ఎలక్టోరల్ అఫెండర్లు , 887 రౌడీ షీటర్లు బైండోవర్

**ఒంగోలు,కలంకౌంటర్ :** ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇప్పటివరకు సార్వత్రిక ఎన్నికల గురించి తీసుకున్న చర్యలను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో వివరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా మరియు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుటలో పూర్తిస్థాయి సంసిద్ధంగా ఉందన్నారు. దీనిలో భాగంగా గత ఎలక్షన్ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారందరిని బైండోవర్ చేయడం జరిగిందని, 426 మందిని ఇప్పటికే బైండోవర్ చేయటం జరిగిందని, మిగిలిన వారిని కూడా త్వరితగతిన బైండోవర్ చెయ్యమని జిల్లాలోని పోలీస్ అధికారులను ఆదేశించడం జరిగింది. ప్రస్తుతం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో 1031 రౌడీ షీటర్ల 887 మందిని సెక్యూరిటీ సెక్షన్ల కింద బైండోవర్ చేయగా, మిగిలిన 144 మంది రౌడీ షీటర్లపై బైండోవర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిను చేసేందుకు రోజువారీ సమీక్షా సమావేశంలో పోలీస్ అధికారులకు ఆదేశాలివ్వడం జరిగింది. ఎలక్టోరల్ అఫెండర్లు చెడు నడత కలిగిన వ్యక్తులు/రౌడీ షీటర్లను బైండోవర్ చేయడంతో పాటు వారి కదలిక పై కూడా నిరంతర నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఇతర జిల్లాల నుండి ఎవరైనా క్రొత్త/అనుమానాస్పద/రౌడీ షీటర్లు జిల్లాలోకి వస్తే ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని వారిపై కూడా పూర్తిస్థాయిలో నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. బైండోవర్ షరతులను ఉల్లంఘింస్తే ఐపిసి సెక్షన్ల ప్రకారం వారిపై పోలీసులు తీసుకునే చర్యల గురించి రౌడీ షీటర్లందరికీ క్షుణ్ణంగా వివరించి కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని ఎంట్రీ/ఎగ్జిట్ పాయింట్లు, ప్రధాన జంక్షన్లలో 18 ముఖ్యమైన చెక్ పోస్టులు ఏర్పాటు చేయబడ్డాయి. చెక్ పోస్ట్‌లు బాధ్యతాయుతమైన ఇంచార్జ్‌ల పర్యవేక్షణలో తగినంత మంది సిబ్బందితో అక్రమ మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు, విలువైన లోహాలు, ఉచిత పంపిణీ సామాగ్రి వంటి వాటిపై నిరంతర తనిఖీలు నిర్వహించబతున్నాయని, ఇప్పటి వరకు రూ:1,79,95,000/- నగదు, 214 గ్రాముల బంగారం, 1872 లీటర్ల అక్రమ మద్యం, 80.3 గ్రాముల మాదకద్రవ్యాలతో పాటు 40 కేజీల పాంగోలిన్ జంతువుకు చెందిన పొలుసులు (హాంక్స్ వంటి జంతువుల ఉత్పత్తి మొదలైనవి) వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో ప్రశాంతమైన వాతావరణంలో



పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు సజావుగా ఎన్నికల నిర్వహణకు భరోసా కల్పిస్తూ ప్రజల్లో పూర్తిస్థాయిలో నమ్మకమును ఏర్పరచడంలో భాగంగా కేంద్ర సాయుధ పోలీస్ బలగాలతో (CAPF) అన్ని సమస్యాత్మక/అతి సమస్యాత్మక గ్రామాల్లో కవాతు చేయడంతో పాటు, అన్ని స్థాయిల పోలీస్ అధికారులు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సందర్శించడం, గ్రామాల్లోని ప్రజానీకంతో మమేకమై అక్కడ నెలకొన్న తాజా పరిస్థితులను అధ్యయనం చేసి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోలీసులు ఇతర శాఖల అధికారులు సమావేశాలను నిర్వహించి ఎలాంటి గొడవలు, అల్లర్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు ర్యాలీలు, సభలు మరియు సమావేశాలు నిర్వహించటానికి ముందస్తు సంబంధిత శాఖల ద్వారా పర్మిషన్ తీసుకోవాలని, పర్మిషన్ లేకుండా నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.. ప్రజలు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, (లేదా) పోలీస్ డయల్ 112 ద్వారా (లేదా) స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ప్రజలకు సూచించారు.

# కళ్యాణ వేడుకలకు ముస్తాబవుతున్న భద్రాద్రి రామయ్య.. అంకురార్పణ..



**భద్రాద్రి,కలంకౌంటర్ :** శ్రీరామనవమి పర్వదినం సమీపిస్తున్న తరుణంలో ఉత్సవాలకు భద్రాద్రి రామయ్య సిద్ధమవుతున్నాడు. నేడు సీతారాముల కళ్యాణ పనులకు అంకురార్పణ జరగనుంది. రేపు డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా రేపు జరగబోయే నిత్య కళ్యాణాలు రద్దు చేశారు. ఏప్రిల్ 17 న అర్చకులు సీతారాముల కళ్యాణం జరిపించి 18 న పట్టాభిషేకం చేస్తారు. కాగా.. ఏటా శ్రీరామనవమికి కొద్ది రోజుల ముందు కళ్యాణ తలంబ్రాలను కలపడం ఆనవాయితీ. ఈ ఏడాది ఈ కార్యక్రమానికి మరో విశిష్టత ఉంది. రామాయణం ప్రకారం సీతాదేవి శోభకృత్ ఫాల్గుణ పౌర్ణమి ఉత్తర నక్షత్రంలో జన్మించారని పండితులు చెబుతున్నారు. ఏ ఏడాది నడుస్తున్నది కూడా శోభకృత్ నామ సంవత్సరం కావడం విశేషం. అమ్మవారి పుట్టిన రోజున తలంబ్రాలను కలపడం వల్ల అందరిపై అమ్మవారి చల్లని చూపు ఉంటుందని భక్తులు భావిస్తున్నారు.

# స్వామి వారిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ




**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి మోహన్. ఆలయ అధికారులు, ఆలయ పండితులు, అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకునగా, ఆలయ అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ని ఆలయ కార్యనిర్వాహణ అధికారి నల్లం సూర్యచక్రధరరావు ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలను అందించారు.

# ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో భారీ చేరికలు..



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణం 5 వ వార్డు బృందావనం ప్రాంతానికి చెందిన పలు బీసీలు, ఎస్టీ కుటుంబాలు సోమవారం రాత్రి వైసీపీ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం బిజెపి జనసేన ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.. వారందరికీ నాగేశ్వరరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.. నాగేశ్వరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వ దుర్మార్గాలను వ్యతిరేకిస్తూ టిడిపిలో చేరటం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని... అలాగే పాత, కొత్త నాయకులు అందరూ కలిసి సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి దోహదపడాలని సూచించారు. కష్టపడిన వారందరికీ రాబోయే ప్రభుత్వంలో గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చిలకపాటి మధుబాబు, వార్డు అధ్యక్షుడు దాసరి ప్రమోద్, గేరా నరేష్, కోటేశ్వరరావు భానుచంద్రావు, జంగాల రాఘవ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు..



వాలంటీర్లు వైసీపీ నేతల ట్రాప్‌లో పడకండి. వైసీపీ నేతలు చెప్పినట్లు చేస్తే వాలంటీర్లు జైలుకెళ్తారు. వాలంటీర్ల భవిష్యత్‌కు నేను గ్యారంటీ.. మీ ఉద్యోగాలుంటాయి. హుందాగా ఉండేలా మీకు ఉద్యోగ భద్రత కల్పిస్తా. రూ.30-50 వేలు సంపాదించేలా నేను అవకాశం కల్పిస్తా. -చంద్రబాబు

–విజయవాడ, కలంకౌంటర్ :

# బలమైన ప్రజాస్వామ్యం కోసం ఎక్కువ భాగస్వామ్యం కావాలి




**ప్రత్తిపాడు(గుంటూరు జిల్లా),కలంకౌంటర్ :** గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఓటర్లను చైతన్యపరిచేందుకు స్వీప్ ప్రోగ్రామ్ నందు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ "సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం" (SVEEP) అని, స్వీప్ అనేది ఓటరు విద్య, ఓటరు అవగాహనను వ్యాప్తి చేయడం, భారతదేశంలో ఓటరు అక్షరాస్యతను ప్రోత్సహించడం కోసం భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యక్రమం. 2009 నుండి భారతదేశ ఓటర్లను సిద్ధం చేయడానికి,ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. స్వీప్ ప్రాథమిక లక్ష్యం భారతదేశంలో నిజమైన భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని నిర్మించడం, అర్హులైన పౌరులందరినీ ఓటు వేయమని ప్రోత్సహించడం మరియు ఎన్నికల సమయంలో సమాచారంతో కూడిన నిర్ణయం తీసుకోవడం అని ఎంపిడివో తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమంలో భాగంగా ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. తదుపరి ఓటర్లను చైతన్య పరిచి,ఓటు హక్కు అందరూ వినియోగించు కావాలని మండల పరిషత్ కార్యాలయం నుండి మల్లాయ పాలెం సెంటర్ వరకు ర్యాలీగా బయలుదేరి,అనంతరం మల్లాయపాలెం సెంటర్ నందు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండల విస్తరణ అధికారి,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, వెలుగు సంఘాల అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి,మండల రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్చకులపై వైసీపీ దాడి దుర్మార్గం

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి కృష్ణాజిల్లా కన్వీనర్, పి. వి. ఫణి కుమార్ , తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ నాయకులు, నిమ్మగడ్డ శ్రీధర్, పి గణేష్ , బిజెపి నాయకులు, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి, నాగలింగం అయోధ్య రామచంద్రరావు లు మంగళవారం మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశం వివరాలు.. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రతి రోజు లో క సంక్షేమం కోసం పూజలు చేసే అర్చకులు, పూజారులపై వైసీపీ పాలనలో దాడులు విపరీతంగా పెరిగిపోయాయి అన్నారు. రాష్ట్రంలో వై కాపా మూకల అరాచకానికి అడ్డు అదుపు లేకుండా పోతోంది. ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏ ఒక్క వర్గము ప్రశాంతంగా జీవనం సాగించ లేని పరిస్థితులు వైసీపీ పాలకులు కల్పించారు అన్నారు. కాకినాడ శివాలయంలో సోమవారం అర్చకులుగా పనిచేస్తున్న సాయి శర్మ, విజయ్ కుమార్ శర్మలపై సాక్షాత్తు ఆలయంలో వైసీపీ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్ దాడికి పాల్పడడం దుర్మార్గమైన చర్య అన్నారు. దేవాలయంలో పూజలు చేసుకునే అర్చకులు, పూజారులపై వైసిపి అధికారంలోకి వచ్చిన నాటినుండి విపరీతమైన దాడులు జరుగుతున్నాయన్నారు. అర్చకులు, పూజారులు అందరూ బాగుండాలని కోరుకుంటారని అలాంటి అర్చకులపై కాకినాడ లోభౌతికంగా దాడులు జరిపిన వైసిపి మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్ పై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా ఎండోమెంట్స్ ఆఫీసర్ ఈ దాడి పై జోక్యం చేసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. భగవంతుడి సేవ తప్ప మరో ధ్యాస లేని అర్చకుల పైన వైసీపీ నాయకు లు ప్రతాపం చూపడం దుర్మార్గం అన్నారు.



# ప్రజలకు బాదుడు లేని సంక్షేమం ఇస్తాం

● గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి





**గుంటూరు,కలంకౌంటర్ :** సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 దోచే ప్రభుత్వం వద్దని, ఆంక్షలు, బాదుడు లేని సంక్షేమం ఇస్తామని, ఎన్డీయే అధికారంలోకి వచ్చాక రూ.4 వేల పెన్షన్ ఇంటికే వస్తుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పిడుగురాళ్ల (గల్లా) మాధవి తెలిపారు. మంగళవారం గుంటూరు 20వ డివిజన్ సంపత్ నగర్ లో జోన్ - 5 టీడీపీ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర, నియోజకవర్గ పరిశీలకులు సింహాద్రి కనకాచారితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు తాము పెన్షన్ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, పెరిగిన ధరలతో రెండుపూటలా భోజనం తినటం కూడా కష్టం అవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి గల్లా మాధవి వారికి భరోసానిస్తూ గతంలో పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చింది ఎన్టీఆర్ అని, దానిని గత పాలకులు రూ. 200 వరకు ఇచ్చేవారని, 2014లో చంద్రబాబు రూ 2000 చేసి ఆర్థికంగా అండగా నిలిచారని, నేడు మళ్ళీ 2000ను రూ. 4000 చేస్తానని చంద్రబాబు ప్రకటించటం హర్షణీయమని మాధవి తెలిపారు. రాష్ట్రంలో పేదల బంధువు ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు మాత్రమే అని గల్లా మాధవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ,జనసేన నేతలు పాల్గొన్నారు.

# చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా...

● అక్రమ మద్యం, డబ్బు ఇతరత్రాలకు అడ్డుకట్ట... ● ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు



**విజయవాడ,కలంకౌంటర్ :** సాధారణ ఎన్నికల నేపథ్యంలో మద్యం, డబ్బు, విలువైన వస్తువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతరం గట్టి నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డిల్లీరావు, పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా మంగళవారం జిల్లా లోని చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులోని అంతర్రాష్ట్ర సరిహద్దు గరికపాడు- చిల్లకల్లు బోర్డర్ చెక్‌పోస్టు, ముక్త్యాల, గండ్రాయి బోర్డర్ చెక్‌పోస్టులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా కార్యకలాపాలను పరిశీలించి, అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని 21 చెక్‌పోస్టులలో జరుగుతున్న కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ లోపాలను సరిదిద్దుతు న్నట్లు తెలిపారు. అధిక మొత్తంలో నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువుల అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# కృష్ణా జిల్లాలో 144 సీవిజిల్ ఫిర్యాదులు పరిష్కారం




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** సీవిజిల్కు అందిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు సీవిజిల్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల్లో 144 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. వీటిలో అధికంగా రాజకీయ నాయకుల ప్లెక్సీలు తొలగించాలని, శిలాఫలకాలపై పేర్లు మూసి వేయాలని ఫిర్యాదులు వచ్చాయని కలెక్టర్ రాజాబాబు తెలిపారు.

# బుర్రా ను, విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండిబుర్రా లక్ష్మి



**కందుకూరు, కలంకౌంటర్ :** కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పామూరు రోడ్డు జంక్షన్ 9వ సచివాలయం, 24వ వార్డు ప్రశాంతి కాలనీలో వైయస్సార్సీపి ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ సతీమణి బుర్రా లక్ష్మి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేదవారి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తన భర్త బుర్రా మధుసూదన్ యాదవ్ ను, ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, మరలా మనమందరం కలిసి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని అన్నారు. అక్కడ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు షేక్ రఫీ, వైయస్సార్సీపి మహిళలు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకాపల్లి ఎంపీ అభ్యర్థిని ప్రకటించిన వైసీపీ

● అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు ● ప్రస్తుతం మాడుగుల సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ముత్యాలనాయుడు ● మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ముత్యాలనాయుడు కూతురు అనురాధకు కేటాయింపు

**అమరావతి, కలంకౌంటర్ :** అనకాపల్లి లోక్ సభ స్థానానికి అభ్యర్థిని వైసీపీ ప్రకటించింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడిని బరిలోకి దించింది. ఇప్పటి వరకు వైసీపీ 175 ఎమ్మెల్యే, 24 ఎంపీ స్థానాలను ప్రకటించింది. అనకాపల్లి ఎంపీ సీటును మాత్రమే పెండింగ్ లో ఉంచింది. ఇప్పుడు ఈ స్థానంలో ముత్యాలనాయుడిని నిలబెట్టారు. ముత్యాలనాయుడు ప్రస్తుతం మాడుగుల సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయనను ఇప్పుడు అనకాపల్లి ఎంపీ స్థానానికి మార్చారు. మాడుగుల ఎమ్మెల్యే టికెట్ ను ఈర్లి అనురాధకు ఇచ్చారు. ముత్యాలనాయుడు కూతురే అనురాధ. బూడి ముత్యాలనాయుడు కొప్పుల వెలమ సామాజికవర్గానికి చెందినవారు.



సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి (పాయకరావుపేట) ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్‌రెడ్డి

–అమరావతి,కలంకౌంటర్ :



సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన టీడీపీ ఏలూరు పార్లమెంట్ ఇంఛార్జ్ గోరుముచ్చు గోపాల్ యాదవ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న తణుకు వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, దెందులూరు వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు పార్లమెంట్ వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్

–అమరావతి,కలంకౌంటర్ :

# మాగుంటను కలిసిన బ్రహ్మం గుప్తా



**నెల్లూరు,కలంకౌంటర్ :** తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమి ఉమ్మడి ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు మెంటా వీరబ్రహ్మం గుప్తా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మం గుప్తా మాట్లాడుతూ ఎంపీగా ఎంతో అనుభవం కలిగిన వ్యక్తి, ఈ ప్రాంతం సమస్యలు తెలిసిన వ్యక్తి మాగుంట శ్రీనివాసులు రెడ్డి అని అన్నారు. అటువంటి మాగుంట శ్రీనివాసులు రెడ్డి మరలా ఎంపీగా గెలిచి పార్లమెంటులో తన గళాన్ని వినిపించాలని బ్రహ్మం గుప్తా ఆకాంక్షించారు.



సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజంపేట టీడీపీ ఎంపీ ఇంఛార్జి గంటా నరహరి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ వైఎస్ఆర్‌సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి.

–అమరావతి, కలంకౌంటర్ :



సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య, ఆయన కుమారుడు చిన్నం చైతన్య ఈ కార్యక్రమంలో పాల్గొన్న తుని వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా, ఏలూరు పార్లమెంట్ వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్, వైఎస్ఆర్‌సీపీ మైలవరం నేత జ్యేష్ఠ శ్రీనాథ్.

–అమరావతి,కలంకౌంటర్ :

# ప్రమాద బాధితులను పరామర్శించిన బుర్రా మధుసూదన్ యాదవ్



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పట్టణానికి చెందిన శ్రీరాంనగర్ వాసులు కూలి పనులు నిమిత్తం మంగళవారం ఉదయం ఆటోలో మెపాడు వైపు వెళ్ళుతున్న క్రమంలో ఆటోను వెనుక వైపు నుంచి వేగంగా వచ్చిన పొగాకు చెక్కుల లోడ్ తో కూడిన ట్రాక్టర్ గుద్ది ఆగకుండా వేగంగా వెళ్ళి పోయిందని ప్రమాద ఆటో లో వున్న బాధితులు తెలిపారు. వీరిని కందుకూరు ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి కి తరలించారు.ఈ సమాచారం తెలుసుకున్న వైయస్సార్ సిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ హుటాహుటిన ఏరియా వైద్యశాలకు చేరుకున్నారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులైన బూసి.లక్ష్మమ్మ, ఉమామహేశ్వరి లను పరామర్శించినారు. ఈ ప్రమాదంలో మరణించిన డాలు.లక్ష్మమ్మ పార్థీవ దేహాన్ని సందర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె భర్త హరిబాబు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు డయాలసిస్ వైద్యం చేయించుకుంటున్నారు. ఈసందర్భంగా మసూద్ యాదవ్ మాట్లాడుతూ బాధ్యత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందవలసిన సహాయాన్ని అందేలా చూస్తామని తెలిపారు.

# ఓటు ఎంతో విలువైనది - నోడల్ ఆఫీసర్ విక్టోరియా రాణి



**కొండేపి, కలంకౌంటర్ :** కొండపి మండలం చోడవరం గ్రామంలో ఓటరు అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించిన కొండపి నోడల్ ఆఫీసర్ విక్టోరియా రాణి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని. ఓటు ఎంత విలువైందని. ఒక్క ఓటుతో. మంచి నాయకుల్ని ఎంచుకోవచ్చు అని. నోడల్ ఆఫీసర్ విక్టోరియా రాణి తెలిపారు. చోడవరం గ్రామంలో పొగాకు కూలీలతో ఓటు విలువల గురించి కూలీలకి తెలియజేశారు. 81 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఎలక్షన్ కమిషన్. బ్యాలెట్ ఓటు కల్పించిందని బ్యాలెట్ ఓటు ఎలా వేయాలి అని వృద్ధ ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు

# అంగరంగ వైభవంగా పంచ గరుడ సేవ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** జగద్గురు శ్రీ రామానుజాచార్య సంస్థాన్ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్న దయాకుంభ్ కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక సంద్రంలో ఓలలాడిస్తున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన పంచ గరుడ సేవ భక్తులను ఆకట్టుకుంది రంగనాథుడు రాముడు కృష్ణుడు వెంకటేశ్వర స్వామి రాజ గోపాలుడు విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి నిర్వహించిన నగరోత్సవం భక్తులను పులకింప చేసింది ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చన లో 500 మంది భక్తులు లక్ష్మీనారాయ–ణులను అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించారు. శ్రీమదష్టాక్షరి జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. సోమవారం జరిగిన సహస్ర గళ లక్ష్మీ అష్టోత్తర పారాయణ భక్తులను ఆకట్టుకుంది. బుధవారం చతుర్యుగమూర్తుల కళ్యాణాలు జరుగుతాయని నిర్వాహకులు శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీకర రామానుజ స్వామి తెలిపారు.

# బీజేపీ కోరితేనే తాను పొత్తుకు ఒప్పుకున్నాడట: చంద్రబాబుపై రోజా సెటైర్లు

**విజయవాడ, కలంకౌంటర్ :** టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో నిన్న ముస్లింలతో ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం సహకారం అవసరం... మనమేమీ వెళ్లలేదు, వాళ్లే వచ్చారు కాబట్టి ఈ పొత్తు పెట్టుకున్నాం అని వివరించారు. దీనిపై ఏపీ మంత్రి రోజా విమర్శనాస్త్రాలు సంధించారు. "అబ్బా... బీజేపీ కోరితోనే తాను పొత్తుకు ఒప్పుకున్నాడట. కుప్పంలో మైనారిటీ నాయకులతో జరిగిన మీటింగ్ లో చంద్రబాబు ఈ విధంగా సెలవిచ్చారు. నిజానికి బీజేపీతో పొత్తు కోసం దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ తో కలిసి ఢిల్లీలో పడిగాపులు కాసింది అందరికీ తెలుసు. ఈ రోజు సారు నాలిక మడతపెట్టారు. వినేవారు ఉంటే ఎన్ని కథలైనా అల్లుతాడు" అంటూ రోజా ఎద్దేవా చేశారు. అంతేకాదు, చంద్రబాబు వ్యాఖ్యల వీడియోను కూడా ఆమె పంచుకున్నారు.

# అర్చకునిపై దాడిని ఖండిస్తున్నాం

- మళ్ళీఇటువంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి
- అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు డా. లంకా



**ఒంగోలు,కలంకౌంటర్ :** కాకినాడలో పెద్ద శివాలయంలోని ఇద్దరు అర్చకులను వైసీపీ నాయకుడు చేసిన దాష్టీకం ఇది చాలా దారుణమైన సంఘటన అని, ఇది వరకు గుడుల పైన దాడి చేసిన వారు ఇప్పుడు గుడిలో ఉన్న అర్చకుల పై దాడి చేయడం అది కూడా కాలితో తన్ని దవడ మీద కొట్టడం, ఇంత కన్నా దారుణం ఏమైనా ఉందా అని అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు డా. లంకా ప్రసన్న కుమార్ శర్మ ఆవేదన వ్యక్తం చేసారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనం ఏ నాగరికంలో ఉన్నామో కూడా అర్థం కాని పరిస్థితి ఇది అని, ఏది ఏమైనా దాడి చేసిన వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అది ఎలా ఉండాలి అంటే తిరిగి వేరొకరి వైపు కన్నెత్తి చూడాలి అన్న భయపడే విధంగా ఉండాలని, దీనికోసం బ్రాహ్మణ జాతి అంతా కలిసి ఎలాంటి కార్యాచరణ చేయడానికైనా సిద్ధంగా ఉంటామని అన్నారు. భక్తుల బాగోగులు భగవంతునికి చేరవేసి వారి సమస్యలు తొలిగిపోవాలని అర్చకులతో పూజలు నిర్వహిస్తూ ఉంటారన్నారు. అర్చకుల కాళ్ళు మొక్కే సంప్రదాయం హిందువులదని అన్నారు. అర్చకులపై దాడి చేయడం అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇలా చేయడం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు తప్ప ఏమీ లాభం లేదని అన్నారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దాడిలో గాయపడిన బ్రాహ్మణ అర్చకులకు ప్రకాశం జిల్లా అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం తరపున తమ సంఘీభావాన్ని తెలియజేస్తున్నామన్నారు. అదేవిధంగా ఏప్రభుత్వం కానీ పార్టీలో నాయకులు లేక వారి అనుచరులు కానీ అర్చకులు పురోహితులు బ్రాహ్మల జోలికి వస్తే ఇకనుంచి తాట తీయటం పనిగా పెట్టుకుంటామని దేశవ్యాప్తంగా దేవాలయాలకు తాళాలు వేసుకుని అక్కడే నిరసనలు చేస్తాం అని హెచ్చరిస్తున్నామన్నారు. ఈ అత్యవసర సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు దీవి హనుమత్ ప్రసాదాచార్యులు, సురపరాజు రాము, పాలుట్ల సాయికృష్ణ, పోగుల దుర్గ ప్రసాద్ శర్మ, ప్రధాన కార్యదర్శి రామరాజు మల్లిఖార్జున శర్మ, కార్యదర్సులు గుడ్లూరి సురేష్, పిడుగు గోపికృష్ణ, పేర్నమిట్ట నరసింహా రావు, దూపాటి రఘురాం, శంకరమంచి శ్రీధర్ తదిరతులు పాల్గొన్నారు. సంఘ బాధ్యులతో పాటు నగరంలోని బ్రాహ్మణ నాయకులు టీవీ శ్రీరామ మూర్తి, కామరాజుగడ్డ కుసుమ కుమారి, ఎస్‌ఏటి రాజేష్, వ్యామజాల ప్రసన్న కుమార్, మారుతీ వినయ్ కుమార్, ఎస్ సుజాత తదితరులు తమ సంఘీభావాన్ని తెలిపి, ఈ విషయంపై ఖండన తెలిపారు.

# అర్చకునిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి
- మళ్ళీఇటువంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి
- స్కందపురి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఐ.వి నాగరాజారావు



**కందుకూరు, కలంకౌంటర్ :** కాకినాడలో పెద్ద శివాలయంలోని ఇద్దరు అర్చకులను వైసీపీ నాయకుడు చేసిన దాడి చాలా దారుణమైన సంఘటన అని, ఇది వరకు గుడుల పైన దాడి చేసిన వారు ఇప్పుడు గుడిలో ఉన్న అర్చకుల పై దాడి చేయడం అది కూడా కాలితో తన్ని దవడ మీద కొట్టడం, ఇంత కన్నా దారుణం ఏమైనా ఉందా అని స్కందపురి బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు ఇప్పగుంట వెంకట నాగరాజారావు, బ్రాహ్మణ సంఘం కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దాడి సంఘటనపై నాగరాజారావు ఆవేదన వ్యక్తం చేశారు.మనము ఏ నాగరికంలో ఉన్నామో కూడా అర్థం కాని పరిస్థితి ఇది అని, ఏది ఏమైనా దాడి చేసిన వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అది ఎలా ఉండాలి అంటే తిరిగి వేరొకరి వైపు కన్నెత్తి చూడాలి అన్న భయపడే విధంగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనికోసం బ్రాహ్మణ జాతి అంతా కలిసి ఎలాంటి కార్యాచరణ చేయడానికైనా సిద్ధంగా ఉంటామని అన్నారు. భక్తుల బాగోగులు భగవంతునికి చేరవేసి వారి సమస్యలు తొలిగిపోవాలని అర్చకులతో పూజలు నిర్వహిస్తూ ఉంటారన్నారు. అర్చకుల కాళ్ళు మొక్కే సంప్రదాయం హిందువులదని అన్నారు. అర్చకులపై దాడి చేయడం వారి పరాకాష్టకం నిదర్శనమని అన్నారు.దీనిని కందుకూరుబ్రాహ్మణ సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా ఏప్రభుత్వం కానీ పార్టీలో నాయకులు లేక వారి అనుచరులు కానీ అర్చకులు పురోహితులు బ్రాహ్మల జోలికి వస్తే ఇకనుంచి తాట తీయటం పనిగా పెట్టుకుంటామని దేశవ్యాప్తంగా దేవాలయాలకు తాళాలు వేసుకుని అక్కడే నిరసనలు చేస్తాం అని హెచ్చరిస్తున్నామన్నారు.

# బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ ప్రచారం



**కుప్పం,కలంకౌంటర్ :** కుప్పంలోని బాబు నగర్ లో బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారంటీ ప్రచారంలో భాగంగా మంగళవారం చంద్రబాబు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక అమలు చేయబోయే సూపర్–6 పథకాలను గురించి మహిళలకు వివరించారు. ఈ ప్రభుత్వంలో తాము పడుతున్న ఇబ్బందుల గురించి చంద్రబాబు వద్ద మహిళలు ఏకరవుపెట్టారు. ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. టీడీపీకి అనుకూలమన్న ఉద్దేశ్యంతో తమ పెన్షన్లు తొలగించారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తమ ప్రభుత్వం వస్తే అన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుందని, రెండు నెలలు ఓపిక పట్టాలని సూచించారు. అకారణంగా లబ్ధిదారులకు ఈ ప్రభుత్వం నిలపేసిన సంక్షేమ పథకాలను తిరిగి అందిస్తామని భరోసా ఇచ్చారు.

# మూడు పార్టీల జెండాలు వేరైనా జగన్ ను గద్దె దించడం ఒక్కటే అజెండా

- రాష్ట్ర బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి



**విజయవాడ, కలంకౌంటర్ :** విజయవాడలో పలువురు ప్రముఖులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి ప్రసంగిస్తూ వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలన్నా, సీఎం జగన్ ను గద్దె దించాలన్నా మూడు పార్టీలు కలవాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందని, ఈ కూటమి త్రివేణి సంగమం వంటిదని అభివర్ణించారు. మూడు పార్టీల జెండాలు వేరైనా, అజెండా ఒక్కటేనని స్పష్టం చేశారు. బీజేపీ మద్దతుదారులు కూటమిలోని ప్రతి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని పురందేశ్వరి పిలుపునిచ్చారు. మూడు పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తేనే ఏపీలో రామరాజ్యం సాకారమవుతుందని అన్నారు. "ఏపీలో టీడీపీతో కలిసి వెళ్లాలని మా అధిష్ఠానం నిర్ణయించింది. అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించడమే కూటమి లక్ష్యం. అందుకే పొత్తు అనివార్యం అని మా పార్టీ పెద్దలు భావించారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలను తన అధీనంలోకి తీసుకుంది. పెద్ద ఎత్తున దొంగ ఓట్లు చేర్పించారు. అన్ని రంగాల్లో అవినీతికి పాల్పడ్డారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి అప్పులు చేశారు. సెక్రటేరియట్ ను తాకట్టు పెట్టకూడదని రాజ్యాంగంలో రాశారా? అని ఒక వైసీపీ నేత అంటున్నాడు. జగన్... నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటాడు... వారికి ఆయన ఏమైనా న్యాయం చేశాడా?" అని పురందేశ్వరి ధ్వజమెత్తారు. ఏపీ అభివృద్ధికి బీజేపీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# యువతరానికి స్ఫూర్తి లావు శ్రీ కృష్ణ దేవరాయలు

- జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ





**గుంటూరు,కలంకౌంటర్ :** విలువలతో కూడిన రాజకీయాలతో యువతరానికి స్ఫూర్తిగా ప్రజాసేవకు అకుంఠిత దీక్ష అంకిత భావంతో ప్రజల మనసులు గెలుచుకున్న ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు భారీ మెజారిటీతో గెలవటం ఖాయమని గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆకాంక్షించారు. తెలుగు దేశం పార్టీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటింపబడిన సందర్భంగా పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు ని గుంటూరు పశ్చిమ టిడిపి అభ్యర్థి గల్లా మాధవితో కలిసి గుంటూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ, తెలుగు యువత సభ్యులు మర్యాద పూ–ర్వకంగా కలిసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయాన్ని కాంక్షిస్తూ సైకిల్ గుర్తుతో కూడిన జ్ఞాపికను అందజేశారు. ఎంపి లావు శ్రీ కృష్ణ తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలవటం ఖాయమని తెలుగు యువత ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, 48వ డివిజన్ టిడిపి అధ్యక్షులు చెరుకుపల్లి నాగరాజు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు గుత్తికొండ కిరణ్, గుంటూరు పశ్చిమ వాణిజ్య విభాగం అధ్యక్షులు తల్లం శేఖర్, తెలుగు యువత నాయకులు చిక్కాల శివరామ కృష్ణ, శొంఠినేని అనిల్, సింగు నాగ మల్లేశ్వరావు, బుల్లా కుమార్ బాబు,షేక్ రఫీ, శ్రీపతి రాంబాబు,శేషాద్రి సాంబశివరావు, పొత్తూరి వెంకటేశ్వర రావు, రాము పాల్గొన్నారు.

# అధికారంలోకి వచ్చిన యేడాదిలో కుప్పంకు హంద్రీనీవా నీళ్లు

**● వైసీపీ డ్రామా కంపెనీ...త్వరలో మూతబడుతుంది ● టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు**




**కుప్పం,కలంకౌంటర్ :** ట్యాంకర్ లో నీళ్లు తెచ్చి పోసి సినిమా సెట్టింగ్ లాగా గేటు పెట్టి జగన్ బటన్ నొక్కి వెళ్లిపోయారు. బటన్ నొక్కినా నీళ్లు నీళ్లు రాలేదు. తెచ్చిపోసిన నీళ్లు తెల్లారేసరికి ఇంకిపోయాయి. అద్దెకు తెచ్చిన గేట్లను సాయంత్రానికే అధికారులు వచ్చి ఎత్తుకెళ్లారు. ఇలాంటి సెట్టింగుల సీఎం వస్తాడని డైరెక్టర్లు, నిర్మాతలు కూడా అనుకోలేదు. కుప్పం భూమిపై నడిస్తే అరిగిపోతాడని రెండు హెలిప్యాడ్ లు ఏర్పాటు చేసి తిరిగాడు. ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులున్నీ పెట్టి జనాన్ని తరలించారు. ఇలాంటి ఘనకార్యాలు చేసిన నువ్వు...నన్ను ఓడిస్తావా.?. ప్రజలు ఛీ కొడతారన్న ఇంగితజ్ఞానం కూడా లేకుండా నీళ్ల తెచ్చానంటూ డ్రామాలాడారు. ఐదేళ్లుగా నడిపిన వైసీపీ డ్రామా కంపెనీని శాశ్వతంగా మూసేయబోతున్నారు. రోడ్డు మార్గం ద్వారా పర్యటనకు మళ్లీ కుప్పం వస్తానని చెప్తున్నాడు...ఏం మొహం పెట్టుకుని వస్తావు.?. హెలికాప్టర్ లో వస్తే చెట్లు నరికించేశాడు...రోడ్ల మీద వస్తే ఇళ్లు పీకేస్తాడేమో.? నిర్లక్ష్యం ఉండవచ్చు కానీ...కక్ష కట్టి నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదు. నీకు కొన్ని ఓట్లు వేసిన పాపానికి ఇలా చేయడం దుర్మార్గం. జరగని అరాచకం రాష్ట్రంలో ఏమన్నా ఉందా? . ఉత్తుత్తి బటన్ నొక్కి నీళ్లు వదిలారు...కనీసం మట్టి పెళ్లలు కూడా తడవలేదు. రాష్ట్రంలో రికార్డులు తారుమారు చేస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు, సర్టిఫికేట్లపై జగన్ ఫోటో పెట్టుకున్నారు. ప్రజాకోర్టులో జగన్ ను శిక్షించాలి. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారు. వలంటీర్లు సేకరించిన ప్రజల వ్యక్తిగత సమాచారం వలంటీర్లు, ఐప్యాక్ వద్ద ఉంది..వలంటీర్ల వద్ద ఉన్న ఫోనులు కూడా వెనక్కి తీసుకోవాలి. కుప్పంలో మెడికల్ కాలేజీతో పాటు అన్నీ అభివృద్ధి చేశా...పులివెందులను కూడా అభివృద్ధి చేశాను. గతంలోనూ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు కుప్పంలో ఇజ్రాయేల్ టెక్నాలజీ నిలిపిపేశారు. ఇప్పుడు జగన్ వచ్చాక మొత్తం నాశనం చేశాడు. సంపదను కొల్లగొట్టారు. కుప్పంలో నీతి, నిజాయితీ ఉంది. నేను ఏ ఎన్నికలకు రాకుండా వాళ్లే నామినేషన్ వేయించి గెలిపించారు. గుండిశెట్టిపల్లెలో బసవేశ్వరస్వామి మాన్యం భూమిని కొట్టేయాలని చూస్తున్నారు. జె.బ్రాండ్స్ వచ్చాయని చెప్పినప్పుడు కాదని నిరూపించకుండా మాపై దాడులకు దిగారు. గంజాయి వచ్చిందని చెప్తే మా కార్యాలయంపై దాడి చేశారు. డ్రగ్స్ పై కనీసం స్పందించలేదు. నేర సామ్రాజ్యానికి విజయసాయిరెడ్డి వరల్డ్ ఫిగర్. తప్పులు చేసి ఎదుటివారిని నిందిస్తున్నారు. ప్రజలు తిరగబాటు చేయనంత వరకూ వీళ్లు అరాచకాలు చేస్తూనే ఉంటారు. రాష్ట్ర బ్రాండ్ ను దెబ్బతీశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా పూర్తి చేసి యేడాదిలో నీళ్లు కుప్పంకు ఇస్తాం. జగన్ కు ఓటేస్తే ఎవరి కుటుంబానికి వారు అన్యాయం చేసినట్లే. జగన్ ఇచ్చిన జీవోలు, నొక్కిన బటన్లు అన్నీ డమ్మీలే. ఇంత విధ్వంసాన్ని నా జీవితంలో చూడలేదు..అన్నీ సరిచేస్తాం. రెస్కోను కొనసాగిస్తాం.



సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సూళ్ళూరుపేట టీడీపీ సీనియర్ నేత వేనాటి రామచంద్రారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పి.వి.మిథున్‌రెడ్డి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెంకటగిరి వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, నెల్లూరు డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి.

–అమరావతి,కలంకౌంటర్ :

# చెక్‌పోస్టులను అకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి




**నెల్లూరు, కలంకౌంటర్ :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్, చెక్ పోస్ట్ లను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా యస్.పి. డా.కె. తిరుమలేశ్వర రెడ్డి. ఎస్పీ సుడిగాలి పర్యటన చేసి బుచ్చి, మర్రిపాడు, ఉదయగిరి, సీతారామపురం, VK పాడు, VV పాలెం, కందుకూరు, ఉలవపాడు పోలీస్ స్టేషన్ లను మరియు ఆయా పరిధిలో గల చెక్ పోస్టులను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా యస్.పి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అక్రమ మద్యం, నగదు, ప్రలోభపరిచే వస్తువులు సరఫరాకు అడ్డుకట్ట వేయటమే లక్ష్యం అని ఆయన అన్నారు.18 చెక్ పోస్టులు, 26 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసి, ప్రతి వాహానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ గట్టి నిఘా పెట్టామని ఎస్పీ తెలిపారు.పోలీస్ స్టేషన్ అధికారులకు ఎన్నికల విధులకు సిద్దంగా ఉండాలని, శాంతియుతంగా నిర్వహించేలా వ్యూహాలపై దిశానిర్దేశం ఇచ్చారు.సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ఏదైనా సంఘటనలు జరిగిన వెంటనే స్పందించి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారిచేశారు.నిర్లక్ష్యం వహించకుండ అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని, తనిఖీ చేయవలసిన విధివిధానాలపై చెక్ పోస్టు సిబ్బందికి పలు సూచనలు.ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి అని సూచనలు చేశారు. ఎంసీసీ రూల్స్ ను అనుసరించి సదరు చెక్ పోస్ట్ ల వద్ద 24 గంటలు వాహనాల తనిఖీ చేయడం జరుగుతున్నది.ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్ళేటప్పుడు రూ.50వేలకు మించినగదు, ఎక్కువ నగలు తీసుకెళ్లొద్దని, ఒకవేళ అవసరాల రీత్యా తీసుకెళ్తే సంబంధిత ఆధారాలు, ధృవీకరణ పత్రాలను అధికారులకు చూపించాలి.ఎవరైనా C-Vigil ద్వారా ఫిర్యాదు చేసిన (లేక) కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన తక్షణమే స్పందించేలా తగిన ఏర్పాట్లు.%CISF% కేంద్ర బాలగాలతో సమస్యాత్మక గ్రామాలలో కవాతు నిర్వహించడం జరుగుతుంది. ఎన్నికల నియమావళిని అందరూ పాటిస్తూ వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సి-విజిల్ యాప్ ద్వారా, (లేదా) టోల్ ఫ్రీ నంబర్ 112 లకు కాల్ చేసి, (లేదా) సంబంధిత పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ప్రజలకు సూచన. ఈ కార్యక్రమంలో కందుకూరు డిఎస్పి ఏ శ్రీనివాసులు, సీఐ నఫీస్, ఎస్సై ఆనంద భాస్కర్, తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గడప గడపకు పేర్ని కిట్టు






**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం గిలకలదిండిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆధ్వర్యంలో ప్రారంభమైన గడప గడపకు సంక్షేమం కార్యక్రమం. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, అభిమానులు

# ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

**● వైస్సార్సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు**







**విజయవాడ,కలంకౌంటర్ :** వైస్సార్సీపీ సెంట్రల్ నియోజకవర్గం వైస్సార్సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు మంగళవారం నియోజక వర్గంలో స్థానిక 24వ డివిజన్ సీతారాంపురం ఏరియా తదితర ప్రాంతాల్లో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత రమేష్, తదితరులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రం ఇస్తూ ప్రజలతో మాట్లాడుతూ ఓట్లను అభ్యర్ధించారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు తెలుపుతున్నారన్నారు. ప్రజలందరూ మాకు మంచి దీవెనలు అందిస్తున్నారన్నారు. ప్రతి ఇంటిలో సంక్షేమ పథకాలు ఇచ్చాం అన్నారు. ఈ కార్యక్రమంలో 24వ డివిజన్ సీనియర్ నాయకులు కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తుక్కుగూడ నుంచి దేశ రాజకీయాలకు శంఖారావం పూరిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

**● తుక్కుగూడలో ఏప్రిల్ 6 లేదా 7వ తేదీన కాంగ్రెస్ జాతీయస్థాయి సభ ఉంటుందని వెల్లడి ● కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాల స్ఫూర్తితో జాతీయస్థాయిలో గ్యారెంటీల ప్రకటన ఉంటుందన్న సీఎం ● లోక్ సభ ఎన్నికలు 100 రోజుల పాలనకు రెఫరెండం అన్న రేవంత్ రెడ్డి**



**తెలంగాణ, కలంకౌంటర్ :** తుక్కుగూడ నుంచి దేశ రాజకీయాలకు శంఖారావం పూరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తుక్కుగూడలో ఏప్రిల్ 6 లేదా 7వ తేదీన కాంగ్రెస్ జాతీయస్థాయి సభ ఉంటుందన్నారు. కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయాల స్ఫూర్తితో జాతీయస్థాయిలో గ్యారెంటీల ప్రకటన ఉంటుందన్నారు. తుక్కుగూడ సభలోనే జాతీయస్థాయి గ్యారెంటీలపై ప్రకటన చేస్తారని తెలిపారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనాయకుడు రాహుల్ గాంధీ హాజరవుతారన్నారు. లోక్ సభ ఎన్నికల్లో 14 స్థానాలు గెలుచుకోవాలని వ్యాఖ్యానించారు. మన 100 రోజుల పాలనకు ఈ ఎన్నికలు రెఫరెండమని చెప్పారు. స్థానిక నేతల నుంచి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ఎంపీ అభ్యర్థుల ఎంపిక జరిగిందన్నారు. చేవెళ్ల, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాలకు ఒకదానితో మరొకదానికి సంబంధం ఉందన్నారు. ప్రధాని మోదీ తన పదేళ్ల కాలంలో తెలంగాణకు ఏం చేశారని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. గుజరాత్‌కు బుల్లెట్ రైలు తీసుకువెళ్తున్న మోదీ వికారాబాద్‌కు కనీసం ఎంఎంటీఎస్ కూడా తీసుకు రాలేదని విమర్శించారు. సబర్మతి రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసిన మోదీ.. మూసీ రివర్ ఫ్రంట్‌కు మాత్రం నిధులివ్వలేదన్నారు. అసలు ఏం చూసి మోదీకి ఓటు వేయాలి? అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తేనే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

# బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీని పార్టీలోకి ఆహ్వానించిన కాంగ్రెస్ నేత

**● ఫిలిబిత్ నుంచి వరుణ్ గాంధీకి టిక్కెట్ నిరాకరించిన బీజేపీ ●ఆయన మూలాలు గాంధీ కుటుంబంతో ముడిపడి ఉండటం వల్లే బీజేపీ టిక్కెట్ ఇవ్వలేదన్న కాంగ్రెస్ నేత ●కాంగ్రెస్‌లోకి వస్తే ఆనందిస్తామన్న అధిర్ రంజన్ చౌదరి**

**తెలంగాణ, కలంకౌంటర్ :** బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీని కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. బీజేపీ ఆయనకు ఫిలిబిత్ నుంచి టిక్కెట్ నిరాకరించింది. ఆయన స్థానంలో ఉత్తర ప్రదేశ్ మంత్రి జితిన్ ప్రసాదకు టిక్కెట్ కేటాయించింది. వరుణ్ గాంధీ కొన్నాళ్లుగా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. దీంతో ఆయనకు బీజేపీ టిక్కెట్ దక్కలేదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అధిర్ రంజన్ చౌదరి మంగళవారం మాట్లాడుతూ... వరుణ్ గాంధీ వస్తే తాము స్వాగతిస్తామన్నారు. ఆయన మూలాలు గాంధీ కుటుంబంతో ముడిపడి ఉండటం వల్లే బీజేపీ టిక్కెట్ నిరాకరించిందని ఆరోపించారు. 'వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లోకి రావాలి. అప్పుడు మేం ఎంతో ఆనందిస్తాం. అతను చదువుకున్న వ్యక్తి. అలాగే క్లీన్ ఇమేజ్ ఉంది. కానీ గాంధీ కుటుంబానికి చెందిన వ్యక్తి కాబట్టి బీజేపీ టిక్కెట్ నిరాకరించింది. అందుకే అతను రావాలని (కాంగ్రెస్) నేను భావిస్తున్నాను' అని అధిర్ రంజన్ అన్నారు. ఫిలిబిత్ నుంచి వరుణ్ గాంధీ 2009, 2019లో విజయం సాధించారు. ఆయన రెండుసార్లు బీజేపీ నుంచే గెలిచారు. 1989లో మేనకా గాంధీ జనతాదళ్ నుంచి గెలిచారు. 1991లో ఇక్కడ బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. ఆ తర్వాత 2004లో, 2014లో మేనకా గాంధీ ఇక్కడి నుంచి బీజేపీ తరపున పోటీ చేసి గెలిచారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com